క్లుప్తంగా

ఎస్‌ఎంసీ చైర్మన్‌ను తొలగించాలి



ఎంఐఎస్ రాజారావుకు ఫిర్యాదు చేస్తున్న బురాన్‌దొడ్డి గ్రామస్తులు

సి.బెళగల్: అర్హతలేని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) చైర్మన్‌ను తొలగించాలని బురాన్‌దొడ్డి గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్ ఆచారి తదితరులు మండల అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం చేరుకుని ఎంఐఎస్ రాజారావుకు ఫిర్యాదును అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అర్హత లేకపోయినా వెంకటేష్ అనే వ్యక్తికి ఎస్‌ఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించారని ఆరోపించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన ఎస్‌ఎంసీ ఎన్నికల అధికారులు, పాఠశాల టీచర్లపై చర్యలు తీసుకుని, వెంకటేష్‌ను చైర్మన్ బాధ్యతల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆలయంలో భక్తుల సందడి



గడివేముల మూల పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూలపెద్దమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు వాల్మీకిసేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు అందించారు.

గూడూరు పీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న జోనల్ మలేరియా ఆఫీసర్ లక్ష్మనాయక్

కోడుమూరు రూరల్: గూడూరు పీహెచ్‌సీని జోనల్ మలేరియా ఆఫీసర్ లక్ష్మనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఆశా డే మీటింగ్‌లో లక్ష్మనాయక్ పాల్గొని పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న హెల్త్ కార్యక్రమాలపై వాకబు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఏవైనా ప్రమాదకర కేసులున్నట్‌లెతై వాటిని జిల్లా వైద్యాధికారులకు రెఫర్ చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఎంఓ నూకరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి షఫియా, సీహెచ్‌ఓ శాంతాకుమారి, ఎంఎస్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి నవీన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం నిర్మల వసంత కుమారి

సి.బెళగల్: రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నవీన్‌ను హెచ్‌ఎం నిర్మల వసంతకుమారి అభినందించారు. మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించి విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నవీన్ గత నెల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, జిల్లా జట్టు తరఫున ఈనెల 2వ తేదీన గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 68వ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కర్నూలు జట్టు రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించిగా, జట్టులో నవీన్ చక్కటి ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థి నవీన్, పీఈటీ సత్యకుమార్‌ను అభినందించారు.

నేడు కాల్వబుగ్గలో బహిరంగ వేలం

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో 3వ నంబర్ దుకాణం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన బహిరంగ వేలం పాటలో ఈ రెండు వ్యాపారాల నిర్వహణ వేలాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే అన్నారు. ప్రస్తుతం ఏడాది కాలం పాటు వ్యాపార నిర్వహణ హక్కులకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు జరిగే వేలం పాటలో రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవలసిందిగా కోరారు.

దిగుబడులు వర్షార్పణం



పాణ్యంలో వరి ధాన్యం తడవకుండా కప్పిన టార్పాలిన్‌లు



తడిసిన వడ్ల బస్తాలు

- నిండా ముంచిన ఫెంగల్ తుపాన్
- ఆరబెట్టిన వరి ధాన్యం నీటి పాలు
- అసలే మద్దతు ధర అంతంత మాత్రం
- తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్

పాణ్యం: మండలంలో రెండు మూడు రోజుల నుంచి ఈదురు గాలులతో ప్రారంభమైన ఫెంగల్ తుపాన్ వల్ల ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వరి రైతు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం మొత్తం నీటి పాలయ్యింది. ఉదయాన్నే తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆరుగాలం కష్టించి పండించిన దిగుబడి నీటిపాలు కావడంతో ఆవేదన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని వేరుచేసి ఆరబెట్టేందుకు ప్రయత్నించగా మధ్యాహ్నం నుంచి మరోమారు వర్షం కురవడంతో తేరుకోలేని నష్టం కలిగింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో దాదాపు 2500 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. దిగుబడి చేతికి వచ్చే సమయంలో తుపాన్ ప్రభావంతో ధాన్యం నీటిపాలై రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చు

ఈ ఏడాది వరి సాగుకు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. గతంలో ఎకరానికి రూ.30 వేల ఖర్చు వచ్చేది. ప్రస్తుత సీజన్‌లో ఎరువులు, కూలీల ఖర్చు పెరగడంతో ఎకరానికి రూ.35 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు అయ్యిందని రైతులు చెబుతున్నారు. పంట బాగుంటే ఎకరానికి 40-45 బస్తాల దిగుబడి వస్తుంది. ఈసారి కూడా ఇదే దిగుబడి వచ్చినా మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో బస్తా రూ.1800 వరకు పలకగా ప్రస్తుతం బస్తా రూ.1500 కూడా పలకడం లేదు. దీనికి తోడు వరికోత యంత్రాల ఖర్చు కూడా గంటకు రూ.3 వేలు తీసుకుంటున్నారు. ఇక ఈదురుగాలులకు నేలవాలిన వరిని కోసేందుకు అదనంగా సమయం పడుతుందని దీనికి కూడా అదనంగా చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

ఫెంగల్ తుపాను వల్ల కురిసిన వర్షానికి పాణ్యం, కొండజూటూరు, బలపనూరు, గోరుకల్లు, ఆలమూరు, గోనవరం, భూపనపాడుతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. ప్రస్తుతం రైతులు ముమ్మరంగా వరి కోతలు చేడుతున్నారు. ధాన్యాన్ని కల్లాల్లో, ఇతర ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకోగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. ధాన్యంపై పట్టలు కప్పినా ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం చర్యలు చేపట్టి పరిహారం అందించిన ఆదుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

దిగుబడి నీటిపాలయ్యింది



నేను ఖరీఫ్‌లో 25 ఎకరాల్లో పంటలను సాగు చేశాను. తుపాను గాలి వల్ల ఐదెకరాల పంట నేలపాలైంది. కట్టలు కడదామనుకుంటే వర్షం ప్రారంభమైంది. వరి మొత్తం నీటమునిగిపోయింది. ఎండ లేని కారణంగా వరి ధాన్యంపై పట్టలు కప్పడంతో తడిసి మొలకెత్తేందుకు సిద్ధంగా ఉంది. తుపాన్ వల్ల తీవ్రంగా నష్టపోయాం.

– అల్లీపురం మాసుం పాణ్యం రైతు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నేను రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. నాలుగు రోజుల క్రితం కోతలు చేపట్టి ధాన్యం ఆరబెట్టుకున్నాను. తుపాను వల్ల రాత్రంతా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అవకాశం లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో మొలకలు వచ్చేలా ఉన్నాయి. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

–కాట్రావత్ దేవానాయక్, కేఆర్ఆర్ తండా



అమ్మవార్లకు కుంభాలతో నైవేద్యం తీసుకెళుతున్న మహిళలు, పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

వైభవంగా దేవర

కోడుమూరు రూరల్: భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కోడుమూరులో నిర్వహించిన దేవర ఘనంగా జరిగింది. గ్రామాభివృద్ధితోపాటు ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కాంక్షిస్తూ మహేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు, గ్రామస్తులు పట్టణంలో వెలసిన శ్రీమహాలక్ష్మి, పార్వతీ దేవి, సరస్వతీ దేవి, చౌడేశ్వరీ దేవి, వల్లెలాంబదేవి, కాళికామాత, రాములమ్మ, తులజాభవాని, లక్ష్మమ్మ, గంగా మాత, సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, మహాయోగి లక్ష్మమ్మకు పదహారు కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. అనంతరం వల్లెలాంబదేవి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ మాజీ చైర్మన్ విజయమనోహరి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి దంపతులు, కోట్ల హరిచక్రపాణిరెడ్డి దంపతులు, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, సౌత్ ఇండియా జౌళి శాఖ డైరెక్టర్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శాపం కాదు



సి.బెళగల్‌లో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



పాణ్యంలో బహుమతులను అందజేస్తున్న దృశ్యం

సి.బెళగల్: అంగవైకల్యం శాపం కాదని, కేవలం శారీరక లోపం మాత్రమేనని సి.బెళగల్ రెగ్యులర్ స్కూల్ హెచ్‌ఎం కిషోర్‌కుమార్, హనుమన్న అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక భవితా కేంద్రంలో ఐఈఆర్‌టీ దివ్యాంగులు, వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన హెచ్‌ఎంలు దివ్యాంగుల సంక్షేమం, అందించాల్సిన సహాయ సహకారాలపై మట్లాడారు. దివ్యాంగులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని, వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు విభిన్న ప్రతిభావంతులకు బహుమతులను అందజేశారు. స్పెషల్ స్కూల్ హెచ్‌ఎం సరోజమ్మ, దివ్యాంగుల తల్లిదండ్రులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

పాణ్యం: స్థానిక భవిత కేంద్రం, ఎంపీయూపీ స్కూల్ ఉర్దూ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉర్దూ పాఠశాల హెడ్‌ఎం శనాజ్ అధ్యక్షతన దివ్యాంగ చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపుదాం

గడివేముల: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలని బూజునూరు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక భవిత స్కూల్‌లో కేకును కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అలాగే ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా గని ఉన్నత పాఠశాలలో ఏఈడీఎస్ ఉపాధ్యాయుడు బాల వెంకటరమణ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు.

కల్లూరు: అర్బన్ పరిధిలోని గోవర్ధన్‌నగర్ భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు చిత్రలేఖనం, క్యారమ్స్, 100, 50 మీటర్ల పరుగు పందెం, నృత్యం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు కల్లూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హుస్సేన్, ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు. దివ్యాంగుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించేలా ర్యాలీ నిర్వహించారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి

ఓర్వకల్లు: ప్రతి గ్రామంలో కుష్టు, టీబీ లక్షణాలున్న ప్రజలను గుర్తించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని కుష్టు వ్యాధి నివారణ జిల్లా వైద్యాధికారి (డీఎస్‌ఎంఓ) డాక్టర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి పరీక్షల నిమిత్తం సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి పంపాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీపీఎంఓ విజయ్‌ప్రకాష్, కృష్ణాబాయి, ఎంపీహెచ్‌ఓ విలియం రాబర్ట్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల, రేమట గ్రామాల్లో మంగళవారం ఏఓ రూసఫ్ రొనాల్డ్ ఆధ్వర్యంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట కోతలు చేపట్టే వారు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. అలాగే రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15వ తేదీలో ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



సి.బెళగల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

సి.బెళగల్: సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన తహసీల్దార్, ఎన్నికల నిర్వహణపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీ పురుషోత్తం, ఏఎస్‌ఓ ఆదినారాయణ, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అధికారి, ఇరిగేషన్ ఏఈ ఉదయ్‌భాస్కర్ ఎన్నికల పీఓలు, ఏపీఓలు ఉన్నారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి

కల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. వివరాలు.. పుసులూరు గ్రామానికి చెందిన గోపాలమ్మ (77) సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యింది. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని కన్నమడకల గ్రామంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ పాఠశాలలను తనిఖీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గైర్హాజరైన విద్యార్థుల గురించి ఆరాతీశారు. పాఠ్యాంశాల ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సబ్జెక్టులో 2 మార్కుల ప్రశ్నల నమోదు, అపార్ అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు మద్దమ్మ, ఎస్తేర్ రాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫెంగల్.. రైతన్న గుండె‘జల్లు’



గార్గేయపురంలో వర్షానికి తడిసిన పొగాకు దిగుబడి

కర్నూలు(రూరల్): ఫెంగల్ తుపాను పొగాకు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంట దిగుబడి చేతికందే దశలో తుపాను రూపంలో ముప్పు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని గార్గేయపురం, దిగువపాడు, శివరామాపురం, పడిదెంపాడు, పూడురు, పసుపల, పి.రుద్రవరం, తదితర గ్రామల్లో పొగాకు పంటను అధికంగా సాగు అవుతుంది. గతేడాది పొగాకు మంచి ధర పలకడంతో ఈ ఏడాది రైతన్నలు అధిక విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేశారు. పంటకాలం పూర్తయి ప్రస్తుతం పొలంలో పందిర్లు వేసి పొగాకు ఎండబెట్టే పనులు జరుగుతున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడడంతో పొగాకు పంట కోతకు ఎకరానికి రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చవుతోంది.

ఎకరానికి రూ.38 వేల వరకు ఖర్చు

కూలీల కొరత, కూలి రేట్లు పెరగడం, పంటకు తెగుళ్లు, మందుల పిచికారీ వంటి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పంట సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం ఫెంగల్ తుపాను భయం పట్టుకుంది. మండలంలో పొగాకు 1968 హెక్టర్లలో సాగైంది. అర్బన్ పరిధిలో 85 హెక్టర్లలో పొగాకు సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో పొగాకు సాగు చేపట్టేందుకు (కోతలతో కలుపుకుని) రూ.38 వేలు ఖర్చవుతుంది. కౌలు రైతులు అదనంగా మరో రూ.10 వేలు కౌలు చెల్లించి పంటసాగు చేపట్టారు.

ఆందోళన చెందుతున్న రైతులు

ఈ ఏడాది పైరు ఆశాజనకంగా ఉండడంతో మంచి ఆదాయం వస్తుందని సంబరపడిన రైతన్నలకు ఫెంగల్ తుపాను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత రెండు రోజుల నుంచి తుపాను ప్రభావంతో మోస్తరు వర్షం కురుస్తుండడంతో పంటను కోసి ఆరబెట్టుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరబెట్టిన పొగాకు వర్షంలో తడిస్తే నాణ్యత తగ్గుతుంది. ఆకు నల్లగా మారితే వ్యాపారులు కొనుగోలు చేసుందుకు ముందుకురారు. అప్పుడు వారు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆరబెట్టిన పొగాకు బేళ్లు వర్షానికి తడవకుండా పట్టలను కప్పిఉంచారు. ఈదురు గాలులకు పట్టలు తొలగిపోకుండా కంటికి రెప్పలా దిగుబడిని కాపాడుకుంటున్నారు.

పొగాకు కోతలు వాయిదా వేసుకోవాలి

పొగాకు పంట కోత చేపట్టకపోయి ఉంటే తుపాను వల్ల ఎలాంటి నష్టం ఉండదు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పొగాకు కోతలను వాయిదా వేసుకోవాలి. పంట కోతలు చేపట్టిన వారు దిగుబడి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. ఆరబెట్టిన పొగాకులో తేమ శాతం ఎక్కువగా ఉంటే వ్యాపారస్తులు ధర తగ్గిస్తారు. అలా జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఏఓ, రూఫస్‌రొనాల్డ్

తీరని నష్టం



ముడుమాల వద్ద నేలకొరిగిన వరి పైరు



సి.బెళగల్‌లో పొగాకు దిగుబడి తడవకుండా టార్పాలిన్ కప్పిన దృశ్యం

సి.బెళగల్: ఫెంగల్ తుపానుతో మండలంలో పొగాకు, వరి సాగుచేసిన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి గాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో కోతలు కోసి ఆరబెట్టిన పొగాకు తడిసిముద్దయ్యింది. కొందరు రైతులు దిగుబడులను కాపాడుకునేందుకు మంగళవారం టార్పాలిన్‌లతో కప్పి ఉంచారు. తడిన పొగాకును ఆరబెట్టకునేందుకు శ్రమిస్తున్నారు. ఇదిలాఉండగా తుంగభద్ర నదితీర గ్రామాలైన గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, కె.సింగవరం, కొత్తకోట, ఈర్లదిన్నె తదితర గ్రామాలలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోత కోసి పొలంలో ఉంచిన వరి దుబ్బులు వర్షంలో తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తుపాన్ ప్రభావంతో కాపుకు వచ్చిన వరిపైరు నేలకొరిగి కోతలకు ఇబ్బందిగా మారింది. కంబదహాల్, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో కళ్లాల్లో ఆరబెట్టిన ఎండుమిరపను రైతులు గత రెండు రోజులుగా టార్పాలిన్‌లతో కప్పి ఉంచుకున్నారు. వర్షాలతో పత్తి రైతులు సైతం అవస్థలు పడుతున్నారు.

శనగ రైతులకు తుపాన్ గుబులు

కోడుమూరు రూరల్: రబీ కింద ముందస్తుగా శనగ పంట సాగు చేసిన రైతులకు తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ కింద వర్షాలు సరిగా లేక పంటలు సాగు చేయని రైతులు అత్యధికమంది రబీ ప్రారంభంలో కురిసిన వర్షాలకు శనగ పంట సాగు చేశారు. మండలంలో సుమారు 7480కుపైగా హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేశారు. ముందుగా సాగు చేసిన శనగ పంట ప్రస్తుతం పూత, బుడ్డ దశకు చేరుకుంది. ఈ తరుణంలో తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో వర్షాలు కురస్తుండడంతో శనగ పూత రాలిపోవడంతో పాటు, పులుసు కారిపోయి పంట దెబ్బతింటోంది. ఇలాగే మరో రెండు మూడు రోజులు వానలు పడితే శనగ పూర్తిగా దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ వసంతలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్: పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎంఈఓ వసంతలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. మండలంలోని పలు స్కూళ్లకు కాపౌండ్ లేదని, బాత్‌రూమ్‌లు సరిగా లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సబ్జెక్టు టీచర్లు లేరని, టీచర్లను నియమించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు పాఠశాల మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేంద్ర, అల్తాఫ్‌బాషా, ఉపాధ్యక్షుడు వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రానికి సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట



మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 9వ తేదీ నుంచి సేవలు నిలిపివేసి సమ్మెలోకి వెళుతున్నట్లు గూడూరు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న కార్మికులు అరవింద్, మధు తదితరులు స్పష్టం చేశారు. వారు మంగళవారం నగర పంచాయతీ కార్మికులతో కలిసి చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్, మధు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి కార్మికుడికి రూ.24 వేల జీతం ఇవ్వాలని, 15 సంవత్సరాలకు మించి పనిచేస్తున్న వారిని పర్మినెంటు చేయాలని, నెలనెలా జీతాలు సక్రమంగా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లను నెరవేర్చకపోతే ఈనెల 9 నుంచి ఇంజినీరింగ్‌కు సంబంధించిన అన్ని విభాగాలతో పాటు, వీధి దీపాలు, నీటి సరఫరా విధులను కూడా ఆపేస్తామని స్పష్టం చేశారు. నగర పంచాయతీ కార్మికులు షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, హుసేన్‌ఖాన్, ఆలీబాషా తదితరులు పాల్గొన్నారు.